
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
ఆదివారం, 8 జూన్ 2025





సండే స్పెషల్
SUNDAY SPECIAL



లోక కల్యాణార్థం.. గిరి ప్రదక్షిణం..

- 'స్తంభాద్రి' వేదికగా అట్టహాసంగా ఆధ్యాత్మిక కార్యక్రమం
- మూడు నెలలక్రితం ఆరంభం.. నెల నెలా పెరుగుతున్న భక్తుల సంఖ్య

సింహాచలం.. యాదగిరిగుట్ట.. ఇలా ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో జరిగే గిరి ప్రదక్షిణ గురించి అందరికీ తెలుసు. ఎంతో మంది వందలాది కిలోమీటర్ల ప్రయాణం చేసి.. వ్యయప్రయాసల కోర్చి ఆయా పుణ్యక్షేత్రాలకు వెళ్లి తమ మొక్కులు చెల్లించుకుంటారు. అలా.. ఆయా దేవస్థానాలకు వెళ్లే అవకాశం లేక.. నిరాశ చెందే భక్తులకు ఇప్పుడా లోటు తీరింది. ఖమ్మం నగరంలోని ప్రాచీన స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వారు గిరి ప్రదక్షిణను అందుబాటులోకి తెచ్చారు. మూడు నెలల క్రితం శ్రీకారం చుట్టిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి నెలనెలా ఆదరణ పెరుగుతోంది. దీంతో ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొంటున్న భక్తుల ఆనందాలకు అవధులు లేకుండా పోతోంది. ప్రతీ నెల స్వామి వారి జన్మ నక్షత్రం రోజున సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామి గిరి ప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

6

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం ఖానాపురం హవేలి

భక్తి శ్రద్ధలతో బక్రీద్

- ఇరు జిల్లాల్లోని ఈద్గాల్లో ముస్లింల సామూహిక ప్రార్థనలు
- సోదరభావం పెంపొందాలని పెద్దల సందేశాలు

7



ఖమ్మం గొల్లగూడెం ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ప్రాణాంతకం.. బ్రెయిన్ ట్యూమర్

- కణితిని తిప్పికొడదాం
- ఉమ్మడి జిల్లాలో 4వేల మంది వరకు బాధితులు
- వంశపారంపర్యంగా వచ్చే అవకాశం
- పని ప్రదేశాలు కూడా కారణమవుతాయి
- కొందరిలో ఎలాంటి కారణాలు లేకుండానే ప్రైమరీ ట్యూమర్‌లు
- జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యం
- ఆధునిక వైద్యసేవలతో నివారణ
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే

7





రైతు భరోసాపై గందరగోళం!

- వానాకాలం పెట్టుబడి సాయం అందజేతపై కొరవడిన స్పష్టత
- రైతులను అయోమయానికి గురిచేస్తున్న ప్రభుత్వ ప్రకటనలు
- ఇప్పటికే మొదలైన వానాకాలం వ్యవసాయ పనులు
- యాసంగి నాటి పెండింగ్ సొమ్ములపై ఆశల్లో అన్నదాతలు
- రబీలో భరోసా అందని 62,561మంది రైతులు.

వైరా, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులకు అండగా నిలిచి.. పెట్టుబడిలో సాయం అందించేలా రూపకల్పన చేసిన రైతుభరోసా పథకం అమలుపై గందరగోళం నెలకొంది. ఈ పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల్లో స్పష్టత కొరవడింది. దీంతో రైతులు గందరగోళానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రైతుభరోసా కాస్తా వాయిదాల భరోసాగా మారిందని రైతులు విమర్శిస్తున్నారు. వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ.. గత యాసంగికి సంబంధించి పెండింగ్ ఉన్న రైతుభరోసా సొమ్ములపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. ఇప్పటికే వానాకాలం వ్యవసాయ పనులు ప్రారంభం కాగా.. రోహిణి కార్తెలోనే భారీ వర్షాలు పడటంతో చాలామంది రైతులు ముందుగానే పత్తి విత్తనాలు వేశారు. పచ్చిరొట్ట విత్తనాలు చల్లుతున్నారు. ఇతర వ్యవసాయ పనులు కూడా మొదలయ్యాయి. అయితే వరినాట్ల సమయానికి రైతు భరోసా ఇస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించగా.. వ్యవసాయ పనుల సమయానికి రైతుభరోసా అందజేస్తామని ఇతర మంత్రులు చేస్తున్న పొంతన లేని ప్రకటనలతో రైతులు గందరగోళంలో ఉన్నారు. ఈ క్రమంలో యాసంగి నాటి పెండింగ్ రైతుభరోసా డబ్బులు ఇస్తారా? లేక ఈ వానాకాలం సీజన్ పెట్టుబడి సాయం మాత్రమే ఇస్తారా? అనే విషయమై ప్రభుత్వ ప్రకటనల్లో స్పష్టత లేకపోవడంతో అందరిలోనూ గందరగోళం నెలకొంది. ఈనెల 5న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో కూడా రైతుభరోసాపై స్పష్టతివ్వలేదు. ఒకేసారి.. అదీ పంట వేసే నాటికే అందరికీ నిధులు జమచేసుకొని మంచిరోజున

(మిగతా 6వ పేజీలో)



यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రోటరీ నగర్ బ్రాంచి
డి.నెం.4-2-118/1, ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్ ఎదురు, వైరా రోడ్డు, ఖమ్మం-507002.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 6(2) / 8(6) క్రింద

అమ్మకం గురించి తెలియజేస్తూ ఋణగ్రహీతలకు ప్రకటన
(30 రోజుల ప్రకటన)

దిగువ వారి నుండి: చీఫ్ మేనేజర్ మరియు అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.
దిగువ వారికి: ఋణగ్రహీత: 1) శ్రీ మెస్సర్స్ అద్విక్ డెంటల్, హెయిర్, స్కిన్ & మాక్సిలోఫేషియల్ ఇంప్లాంట్స్ హాస్పిటల్స్ తరఫున సోల్ ప్రొప్రయిటర్ శ్రీ కాదూరు సునీల్ కుమార్, 2వ ఫ్లోర్, హెచ్.నెం.11-4-72/2, నెహ్రూ నగర్, ఖమ్మం-507002, తెలంగాణ. 2) శ్రీ కాదూరు సునీల్ కుమార్, తండ్రి: నాగరత్నం, (యజమాని & తనఖాదారు) వృత్తి: డాక్టర్, నివాసం: హెచ్.నెం. 5-12-515, శ్రీనివాస కాలనీ, బీటీయస్ నియర్ ఫారెస్ట్ ఆఫీస్, నల్గొండ టౌన్-508001.
సర్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రోటరీ నగర్ బ్రాంచి కు బకాయివున్న మొత్తాన్ని రాబట్టుకొనుట కొరకు శ్రీ కాదూరు సునీల్ కుమార్, తండ్రి: నాగరత్నం, కి చెందిన ఆస్తి అమ్మకం.
సదరు చట్టం క్రింద నాకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సెక్షన్ 13(2) క్రింద 30-10-2024 తేదీగల డిమాండ్ నోటీసు ద్వారా బ్యాంక్ డిమాండ్ చేసినప్పటికీ మీరు చెల్లించాల్సిన బకాయి మొత్తం తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున ఆస్తిని తేది: 07-01-2025న మేము స్వాధీనం చేసుకున్నాము.
ఆస్తులను స్వాధీనం చేసుకున్న తరువాత కూడా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రోటరీ నగర్ బ్రాంచి కు మీ నుండి బకాయి వున్న మొత్తాన్ని మీరు చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు తేదీ నుండి 30 రోజుల తరువాత ఇ-వేలం ద్వారా విక్రయించుట తప్పనిసరి అవుతుంది. ఇ-వేలం తేది మరియు సమయం మరియు సర్వీస్ ప్రొవైడర్ వివరాలు అమ్మకం నోటీసు ద్వారా తెలియజేయబడుతుంది. అది విడిగా జారీ చేయబడుతుంది మరియు ఆస్తిని అత్యధిక ధరను ఆఫర్ చేసిన వ్యక్తికి విక్రయించబడును.
ఆస్తి బ్యాంక్‌కు అంగీకారయోగ్యమైన నియమ నిబంధనలకు లోబడి ప్రైవేట్ అమ్మకం లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కోరుట ద్వారా ఎవరికైనా ఆస్తిని విక్రయించు ప్రతిపాదన ఏదైనా మీకు ఉంటే ఈ నోటీసు/లెటర్ స్వీకరణ తేదీ నుండి 30 రోజులలోగా నాకు తెలియజేయవలెను. విఫలమైనచో అటువంటి ప్రతిపాదన మీకు ఏదీ లేనట్లుగా భావించబడును. మరియు నేను ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయంతో ముందుకు సాగుతాను.
సెక్యూర్డ్ అస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం కోసం నోటీసు ప్రచురణ తేదీ వరకు బ్యాంక్‌కు అయిన వ్యయం మరియు ఖర్చులతో సహా దానిపై తదుపరి వడ్డీతో 30-10-2024 తేదీ గల డిమాండ్ నోటీసులో నిర్దేశించిన విధంగా బకాయి వున్న మొత్తాన్ని మీరు అస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం కోసం నోటీసు ప్రచురణ తేదీ ముందుగా చెల్లిస్తే, షెడ్యూల్‌లో తెలిపిన అస్తుల అమ్మకం కొరకు తదుపరి చర్య తీసుకోబడదు. (చట్టంలోని సెక్షన్ 13(8) రిడెంప్షన్ హక్కు అందుబాటులో ఉంది)

ఆస్తి షెడ్యూలు

నల్గొండ జిల్లా, నకిరేకల్ మండలం యొక్క లిమిట్స్, చందంపల్లి గ్రామము, సర్వే నెం.74/డి/2/1 నందు 968 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఇంటి ప్లాట్‌కు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: ఉత్తరం: విజయవాడ హైవే నెం.65; దక్షిణం: యామ అజయ్‌కుమార్ యొక్క స్థలము; తూర్పు: యామ అజయ్‌కుమార్ యొక్క స్థలము; పడమర: తండు వెంకన్న యొక్క స్థలము.

తేది: 31-05-2025, ప్రదేశం: ఖమ్మం సం/-అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



అప్‌గ్రేడ్ అయిన కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఇదే..

ఇదేం విభజన?

- కొత్తగూడెం కార్పొరేషన్ డివిజన్ల విభజనపై అసంతృప్తులు
- ముసాయిదా జాబితాపై తీవ్ర అభ్యంతరాలు
- అశాస్త్రీయంగా విభజించారని పలు వర్గాల నుంచి ఆరోపణలు
- ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామంటున్న అధికార పార్టీ నేతలు

కొత్తగూడెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటు కాబోతున్న కొత్తగూడెం కార్పొరేషన్‌లో డివిజన్ల విభజనపై పలు వర్గాల నుంచి అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. డివిజన్ల విభజనను అధికార యంత్రాంగం అశాస్త్రీయంగా చేపడుతోందని పలువురు విమర్శిస్తున్నారు. భద్రాద్రి జిల్లా కేంద్ర పరిధిలోని కొత్తగూడెం నియోజకవర్గంలో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో పాటు సుజాత నగర్ మండలంలోని ఏడు పంచాయతీలను కలిపి కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్పొరేషన్‌ను 60డివిజన్లుగా విభజించాలని రాష్ట్ర మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ నుంచి ఇటీవల ఉత్తర్వులు అందాయి. దాంతో డివిజన్ల విభజనపై ముసాయిదా తయారు చేసి కొత్తగూడెం, పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ఉంచారు.

విభజనపై విమర్శలు..

కొత్తగూడెం కార్పొరేషన్‌లో డివిజన్ల విభజన అశాస్త్రీయంగా చేపట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రణాళిక లేకుండా డివిజన్లను విభజించి నివేదికలు తయారు చేస్తున్నారని అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర పార్టీలకు చెందిన నాయకులు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ ఏర్పాటు, డివిజన్ల విభజనపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని, నామమాత్రంగా పత్రికలకు ప్రకటనలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డివిజన్ల విభజనపై అభ్యంతరాలను ఎవరు తీసుకుంటారు, ఎక్కడ తీసుకుంటారు, ఏ రోజు ఫిర్యాదు చేయాలన్న విషయాలపై మునిసిపల్ అధికారులు సరైన ప్రచారం చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ల విభజన వ్యవహారంపై అధికార పార్టీ నేతలు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, కలెక్టర్‌కు ఫిర్యాదులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. మునిసిపల్ అధికారులు డివిజన్ల విభజనకు ప్రజలనుంచి కానీ స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి కానీ ఎలాంటి సూచనలు, సలహాలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. మరోవైపు డివిజన్ల విభజనపై అధికార,

(మిగతా 6వ పేజీలో)

మారుతున్న పాల్వంచ ముఖచిత్రం

- ఆశ, నిరాశల మధ్య ప్రజలు
- కార్పొరేషన్‌లో విలీనంపై భిన్నాభిప్రాయాలు

6

మేఘాల మేళంతో.. మృగశిర ఆగమనం

- కార్తె రాకతో వాతావరణంలో మార్పులు
- ప్రారంభం కానున్న వ్యవసాయ పనులు

7



ఢిల్లీ పబ్లిక్ స్కూల్
నూతన భవనం ప్రారంభోత్సవం



ముఖ్య అతిథి
శ్రీ తుమ్మల నాగేశ్వరరావు
రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు

గౌరవ అతిథి
శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి
విచ్చేయుచున్న అతిరథ మహారథులకు
మరియు మా మిత్రులకు, శ్రేయోభిలాషులకు
స్వాగతం - సుస్వాగతం

గౌరవ అతిథులు
శ్రీ రామసహాయం రఘురామ రెడ్డి - పార్లమెంట్ సభ్యులు, ఖమ్మం
శ్రీమతి పునుకొల్లు నీరజ - మేయర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్
శ్రీ కురాకుల వలరాజు - 14వ డివిజన్ కార్పొరేటర్, ఖమ్మం
శ్రీ మువ్వా విజయబాబు, ఛైర్మన్ - తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల కార్పొరేషన్ లిమిటెడ్
శ్రీ రాయల నాగేశ్వరరావు, ఛైర్మన్ - తెలంగాణ రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్
శ్రీ తుమ్మల యుగంధర్ - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు
శ్రీ పొంగులేటి ప్రసాద్ రెడ్డి - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు
శ్రీ తుంబూరు దయాకర్ రెడ్డి - పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జి
శ్రీ ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి - హైకోర్ట్ అడ్వకేట్, తెలంగాణ
శ్రీ లంకిరెడ్డి సత్యనారాయణ రెడ్డి - Ex. MPTC, నారాయణపురం
శ్రీ కీసర వెంకటేశ్వర రెడ్డి - PACS ఛైర్మన్, కొర్లగూడెం
శ్రీ పొంగులేటి మహేందర్ రెడ్డి - బిజెపి నాయకులు

ఈ శుభసమయాన అందరూ ఆహ్వానితులే...!

KADARI RAVINDER REDDY M.Sc., M.A., M.Phil - Chairman
KADARI VINEETHA REDDY B.Sc., B.Ed. & M.Sc. - Director

Padmaja Ads / 8008288630

DELHI PUBLIC SCHOOL
CBSE CURRICULUM GRADE I TO X | NEET & IIT FOUNDATION ELITE I IGNITE I SHASTRA
Vasista Main Campus : Gopalapuram, KHAMMAM. ✆ : 9603 482 482, 9640 192 192

పాల్వంచ వ్యూ



మారుతున్న పాల్వంచ ముఖచిత్రం

- ఆశ, నిరాశల మధ్య ప్రజలు
- కార్పొరేషన్‌లో విలీనంపై భిన్నాభిప్రాయాలు
- ఇప్పటికే తరలిపోయిన కార్యాలయాలు

పాల్వంచ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ ముఖచిత్రం మారుతోంది. పురపాలక సంఘం బోర్డులను మార్చి కొత్తగూడెం కార్పొరేషన్ బోర్డులను ఏర్పాటుచేశారు. ఎంతో చారిత్రాత్మకమైన చరిత్ర కలిగిన పాల్వంచ పేరు కనుమరుగు అవుతుందని స్థానికుల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పాల్వంచ అభివృద్ధిపై ఆశ, నిరాశల మధ్య ప్రజలు సందిగ్ధంలో ఉన్నారు. ఇప్పటికే పాల్వంచ మునిసిపాలిటీకి ఎన్నికలు లేక అభివృద్ధి అంతంతమాత్రంగా సాగుతోంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పాల్వంచలో స్పాంజ్‌ఐరన్ మూతపడటం, కేటీపీఎస్‌లోని కొన్ని యూనిట్లను పూర్తిగా తొలగించడంతో పాటు కొన్ని కార్యాలయాలు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిపోవడంతో ఇక అభివృద్ధిపై ప్రజల్లో ఆశలు సన్నగిల్లాయి. ఈ క్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలవడంతో ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధి జరుగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కాకతీయుల కాలంలో 12 ఆమడల పాల్వంచగా గుర్తింపులో ఉంది. 1939 కాలంలో పట్టణంలోని ప్రధాన సెంటరులో పరిపాలన విభాగపు, న్యాయ, ఆర్థిక కార్యాలయాలు నిర్మించారు. ఆనాటి భవనాల్లో భక్తరామదాసు సైతం నివాసంగా ఉంటూ భద్రాచలం రామాలయ నిర్మాణ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఈ కార్యాలయం ఉమ్మడి జిల్లాలో ఐటీడీఏ కేంద్రంగా కొలువు దీరింది. పాల్వంచకు ఒక ప్రత్యేక స్థానం ఉండేది. ఇక్కడి నుంచే పరిపాలన కొనసాగేది. పాల్వంచ తొలుత గ్రామపంచాయతీగా ఆ తర్వాత 1987లో మునిసిపాలిటీగా మారింది. అప్పుడు 80,194 మంది జనాభా ఉండగా 24వార్డులను ఏర్పాటు చేశారు. కానీ నేటికీ ఎన్నికలు జరగకపోవడంతో 24 వార్డుల్లో అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. పాలకమండలి లేకపోవడం వల్ల ప్రజల సమస్యలపై మాట్లాడే వారు లేరనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పాల్వంచ మునిసిపాలిటీలో 1.50 లక్షల మంది జనాభా ఉన్నారు. క్రమేపి పాల్వంచ కేంద్రంలో ఉన్న ఐటీడీఏ కార్యాలయాన్ని భద్రాచలానికి, ఆర్డీవో కార్యాలయాన్ని కల్లూరుకు మార్చారు.

పారిశ్రామికంగా ఇలా..

పాల్వంచలో కేటీపీఎస్, స్పాంజ్‌ఐరన్, నవభారత్ లాంటి పరిశ్రమలు ఉండటంతో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. కార్మికులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కూడా కార్మికులు ఇక్కడికి పని చేసేందుకు వచ్చే వారు. పారిశ్రామిక నగరంగా కొంతకాలం విలసిల్లింది. ఆ తర్వాత స్పాంజ్‌ఐరన్ కర్మాగారం మూసివేయడంతో ఎంతో మంది కార్మికులు వలసబాటపట్టారు. ఇక్కడ పని చేసిన ఉద్యోగులను ఇతర రాష్ట్రాలకు పంపించారు. ఇదే తరహాలో కొత్తగూడెం థర్మల్ పవర్‌స్టేషన్‌లోని పాత ప్లాంట్లను తొలగించడంతో అందులో పని చేస్తున్న ఉద్యోగులను బీటీపీఎస్, యాదాద్రి థర్మల్‌ప్లాంట్లకు బదిలీ చేశారు. దీంతో పాల్వంచలో వాణిజ్య, వ్యాపార రంగాలు సంక్షోభంలో పడ్డాయి. స్థానికులకు కూడ ఉపాధి పనులు కరువయ్యాయి. పారిశ్రామికంగా అభివృద్ధిలో ఉన్న పాల్వంచ తిరోగమన దశలో ఉండటంతో స్థానిక ప్రజల్లో నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

కార్పొరేషన్‌పై భిన్నాభిప్రాయాలు

పాల్వంచ మునిసిపాలిటీ కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం కావడంతో ముఖచిత్రం మారుతోంది. బోర్డులపై పేర్లు మార్చడంతో స్థానికుల్లో భిన్నాభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి పనులు లేక కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పాల్వంచను కార్పొరేషన్‌లో కలపడం వల్ల అభివృద్ధిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పన్నులు పెరుగుతాయని ప్రజలు ఆందోళనలో ఉన్నారు. గతంలో కార్పోరేషన్ వల్ల అభివృద్ధి జరుగుతుందా.. లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్పోరేషన్ కావడంతో ఎన్నికలు జరిపి పాలకవర్గం ఏర్పాటు చేయడం వల్ల అభివృద్ధి పడుతుందనే వాదనలు పలువురు వ్యక్తం చేస్తోన్నారు. డివిజన్ల ప్రక్రియ వేగవంతంగా జరుగుతున్నక్రమంలో కార్పొరేషన్‌పై తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి.

లోక కల్యాణార్థం.. గిరి ప్రదక్షిణం..

సండే స్పెషల్ SUNDAY SPECIAL



గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు

- 'స్తంభాద్రి' వేదికగా ఆధ్యాత్మిక కార్యక్రమం ప్రారంభం
- మూడు నెలల క్రితం ఆరంభం.. నెల నెలా పెరుగుతున్న భక్తుల సంఖ్య

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలో మరో ఆధ్యాత్మిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సింహాచలం, యాదిగిరిగుట్ట లాంటి లక్ష్మీనర్సింహాస్వామి క్షేత్రాల్లో మాత్రమే గిరి ప్రదక్షిణకు వీలుంది. కానీ అక్కడి వెళ్లడం వీలుకాని ఉమ్మడి జిల్లా భక్తుల కోసం ఖమ్మం నగరంలోని స్తంభాద్రి లక్ష్మీనరసింహాస్వామి గిరి ప్రదక్షిణను భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దేవాదాయ శాఖ అధికారులు. మన నగరంలోనే స్వామి వారి గిరి ప్రదక్షిణ అందుబాటులోకి రావటంతో భక్తుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల స్వామి వారి జన్మ నక్షత్రం రోజున సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామి గిరి ప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

2వేల మంది భక్తులతో ప్రారంభమై...

దివ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న స్తభాంద్రి లక్ష్మీ నరసింహస్వామి (గుట్ట) గిరి ప్రదక్షిణ మొదటిసారి ఈ ఏడాది ఫిబ్రవరి 2న 2 వేల మంది భక్తులతో ప్రారంభమైంది. నేడు ఆ సంఖ్య సుమారు 5 వేల మందికి పెరిగింది. దేవాదాయ శాఖ అధికారులు,ఆలయ అధికారులు గిరి ప్రదక్షిణపై పెద్దగా ప్రచారం నిర్వహించకున్నా భక్తులు అధిక సంఖ్యలోనే తరలొస్తున్నారు. గిరి ప్రదక్షిణపై ప్రచారం నిర్వహిస్తే కేవలం ఖమ్మం నగర భక్తులే కాక ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇతర ప్రాంతాల భక్తులు పాల్గొనేందుకు అవకాశం కలుగుతోంది. ఇక గిరి ప్రదక్షిణ సుమారు రెండు కిలోమీటర్ల వరకు జరుగుతుండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నారు. ప్రదక్షిణ గుట్ట చుట్టూ తిరుగుతూ గుట్టపైకి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. ప్రదక్షిణ అనంతరం కొండపై ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన స్వాతి నక్షత్ర జ్యోతిని వెలిగించి భక్తులు దివ్యజ్యోతి దర్శనం చేసుకుంటారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తారు.

గిరి ప్రదక్షిణలో పాల్గొనటం పూర్వజన్మ సుకృతం



పూర్ణచందర్‌రావు, జయనగర్‌కాలనీ, ఖమ్మం

నగరంలోని స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి వారి గిరి ప్రదక్షిణలో పాల్గొనడం నా పూర్వజన్మ సుకృతం. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొడం ద్వారా తెలియని అనుభూతి కలుగుతోంది. నేను, నా కుటుంబం అంతా కూడా గిరి ప్రదక్షిణ చేస్తున్నాం. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనటం మేం అదృష్టంగా భావిస్తాం.

నవగ్రహ దోషాలకు విముక్తి



నరహరి శ్రీనివాస చార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు

స్వామి వారి జన్మ నక్షత్రం రోజున గిరి ప్రదక్షిణలో పాల్గొంటే నవ గ్రహ దోషాల నుంచి విముక్తి కలుగుతుంది. గిరి ప్రదక్షిణ చేసిన అనంతరం భక్తులు గుట్టపై ప్రత్యేక వేదికలో ఏర్పాటు చేసిన స్వాతి నక్షత్ర జ్యోతిని తప్పకుండా దర్శించుకోవాలి. నెలనెలా భక్తుల సంఖ్య పెరుగుతుండగా.. అందుకు తగ్గట్టుగానే దేవాదాయ శాఖ, ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతీ నెల స్వామి జన్మ నక్షత్రం రోజున..



కొత్తూరు జగన్‌మోహన్‌రావు, ఆలయ ఈఓ

ఫిబ్రవరిలో ప్రాంభమైన స్వామి వారి గిరి ప్రదక్షిణకు భక్తుల నుంచి విశేష స్పందన రావడంతో.. ప్రతీనెల స్వామి జన్మనక్షత్రం రోజున నిర్వహించాలని నిర్ణయించాం. నెలనెలా భక్తుల సంఖ్య కూడా పెరుగుతోంది. నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటోంది. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు మజ్జిగ, పానకంతోపాటు ఆలయంలో ప్రసాదం అందిస్తున్నాం. ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.



కన్నుల పండువగా...

స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి (గుట్ట) గిరి ప్రదక్షిణను స్వామివారి జన్మనక్షత్రం రోజైన శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చక బృందం, దేవాదాయ శాఖ అధికారులు, భక్త బృందాల ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరహరి నర్సింహాచార్యులు, రామ కృష్ణాచార్యులు, శ్రీనివాసచార్యులు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొత్తూరు జగన్‌మోహన్‌రావు, దేవాదాయ శాఖ అధికారులు, భక్తబృందాల ఆధ్వర్యంలో స్వామి వారి గిరి ప్రదక్షిణ సాగింది. గిరి ప్రదక్షిణ జరిగిన మార్గంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన ఈ ప్రదక్షిణ రాత్రి 8 గంటల వరకు జరగ్గా.. జయకేతనాలతో గుట్ట ప్రాంతం మారుమోగింది. భక్తులకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ప్రదక్షిణ అనంతరం కొండపై స్వాతి నక్షత్ర జ్యోతిని వెలిగించి భక్తులు దివ్యజ్యోతి దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఓపెన్‌స్కూల్ ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫలితాల వెల్లడి

- వివరాలు వెల్లడించిన జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరచారి

కొత్తగూడెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ ఓపెన్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర చారి, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావు, ఏసీజీఈ ఎస్.మాధవరావులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించిన ఫలితాలను ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో మొత్తం 654మంది విద్యార్థులు హాజరుకాగా 203మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం 31.04 శాతం, ఇంటర్మీడియట్‌లో 758 మంది విద్యార్థులు హాజరుకాగా 388మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం 51.19 శాతం. ఈ పరీక్షల్లో రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కావాల్సిన అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 18లోపు www.telanganaopen-school.organisation వెబ్‌సైట్‌లో లేదా మీ సేవా సెంటర్లలో సంబంధిత ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వాల్యూడ్ ఆన్సర్స్ స్లిప్ రీకౌంటింగ్‌కు ఇంటర్మీడియట్‌కు ఒక్క సబ్జెక్టుకు రూ.400లు, పదో తరగతికి రూ.350లు రివెరిఫికేషన్, ఆన్సర్ స్లిప్ జిరాక్స్ పొందుటకు ఇంటర్మీడియట్ ఒక సబ్జెక్టుకు రూ.1200, పదో తరగతి ఒక సబ్జెక్టుకు రూ.1200 చెల్లించాలని విద్యాశాఖాధికారి తెలిపారు.

నేడు మధిర జూనియర్ కాలేజీ స్వర్ణోత్సవం

- హాజరవనున్న డిప్యూటీ సీఎం భట్టి

మధిరటౌన్, జూన్7(ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాన్ని ఆదివారం నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ అనంతరం పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. తర్వాత స్వర్ణోత్సవ సావనీర్ ఆవిష్కరణ, సభా కార్యక్రమం నిర్వహించనున్నారు.. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరు కానున్నారు. 1969లో ఏర్పాటైన కళాశాలలో ఇప్పటి వరకు దాదాపు 11వేల మంది విద్యార్థులు చదువుకున్నారు. ఆర్గనైజింగ్ కమిటీ ఇప్పటికే అందరికి ఆహ్వానాలు పంపించింది.

ముత్యాల కవచాలంకారంలో జమలాపురం శ్రీవారు



క్యూలైన్లలో నిండిపోయిన భక్తులు

ఎర్రుపాలెం, జూన్7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురంలో కొలవైఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకిలో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకల్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు.

గాలివాన బీభత్సం

జూలూరుపాడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జూలూరుపాడులోని హోలీఫేయిత్ చర్చీ సమీపంలో కొత్తగూడెం - ఖమ్మం ప్రధాన రహదారిపై చెట్టు విరిగిపడింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. సుమారు గంటసేపు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చెట్టుని రహదారిపై నుంచి తొలగించారు. జూలూరుపాడు పంచాయతీ పరిధిలోని న్యూకాలనీలో చెట్టు విరిగి విద్యుత్ లైనుపై పడటంతో తీగలు తెగికిందపడ్డాయి.

రైతు భరోసాపై గందరగోళం!

(5వ పేజీ తరువాయి)

ఇవ్వాలని కేబినెట్ భేటీలో అభిప్రాయపడినట్టు వార్తలొచ్చాయే తప్ప తప్ప ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన మాత్రం రాలేదు.

యాసంగి సొమ్ములు రాలే..

యాసంగి వ్యవసాయ సీజన్ ముగిసి వానాకాలం వ్యవసాయ సీజన్ మొదలైంది. కానీ యాసంగి నాటి రైతుభరోసా సొమ్ము నేటికీ పూర్తిగా చెల్లింపు జరగలేదు. కేవలం నాలుగు ఎకరాల్లోపు భూములున్న రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందించగా.. ఖమ్మం జిల్లాలో 62,561మంది రైతులకు నాడు సాగుసాయం అందలేదు. ఈ రైతులకు రూ.178.95కోట్లకు పైగా నేటికీ చెల్లించలేదని తెలుస్తోంది. 2023 నవంబరుకు ముందు రెండు వ్యవసాయ సీజన్లకు ఎకరాకు రూ.15వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. గత బీఆర్ఎస్ హయాంలో రెండు వ్యవసాయ సీజన్లకు ఎకరానికి రూ.పదివేలు రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని అందించిన విషయం తెలిసిందే. 2023 నవంబరులో ఎన్నికల సమయంలోనే యాసంగి పెట్టుబడిసాయాన్ని రైతుల ఖాతాల్లోకి జమచేసేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు రాగా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా రైతుల ఖాతాల్లో పెట్టుబడిసాయాన్ని ప్రభుత్వం జమచేస్తుందని కాంగ్రెస్ ఫిర్యాదు చేయడంతో ఆ నిధుల జమకు బ్రేక్ పడింది. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2023 యాసంగికి చెందిన పెట్టుబడి సాయాన్ని దశలవారీగా 2024 ఎంపీ ఎన్నికల సమయం నాటికి ఎకరానికి రూ.ఐదువేల చొప్పున రైతుల ఖాతాల్లో జమచేసింది.

రూ.15వేలకు హామీ ఇచ్చి.. రూ.12కు కుదింపు

తమ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఎకరానికి రూ.15వేల పెట్టుబడి సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మొత్తాన్ని రూ.12వేలకు కుదించింది. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయేతర భూములకు కూడా రైతుబంధు చెల్లించారనే ఆరోపణలు చేస్తూ ఆభూములను తొలగించి సాగుచేస్తున్న భూములకు మాత్రమే రైతుబంధు స్థానంలో రైతుభరోసా పేరిట ఏడాదికి రెండు వ్యవసాయ సీజన్లకు గానూ రూ.15వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ఆతర్వాత ఆమొత్తాన్ని రూ.12వేలకు తగ్గించారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.12వేల పెట్టుబడిసాయం గురించి ప్రకటించారు. ఆతర్వాత ఈ ఏడాది జనవరి 26న యాసంగి సీజన్‌కు రూ.ఆరువేల చొప్పున రైతుభరోసా పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ఒక్కో గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ప్రకటించి ఆ గ్రామంలోని రైతులందరికీ రైతుభరోసా చెల్లించారు. ఆ తర్వాత ఫిబ్రవరి 5, 11తేదీల్లో రెండు, మూడు దశల్లో నాలుగు ఎకరాల వరకు భూములున్న రైతులకు సొమ్ములు చెల్లించారు. అయితే మొదట్లో ఇందులో కూడా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రెండెకరాలున్న రైతులకు కూడా సర్వేనెంబర్ల వారీగా మాత్రమే ఒక్క ఎకరానికి రైతుభరోసా చెల్లించి మిగిలిన వాటిని నిలిపివేశారు. ఈ సమస్యను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో ప్రభుత్వపరంగా దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

రబీలో అందని రైతుభరోసా

ఖమ్మం జిల్లాలో రైతుభరోసా కింద 3,51,592మంది రైతులు అర్హులు కాగా ఇప్పటివరకు 2,89,039మందికి రైతుభరోసా చెల్లించారు. 3,51,592మంది రైతులకుగాను రబీ సీజన్‌కు ఎకరానికి రూ.ఆరువేల చొప్పున రూ.438.70కోట్లు పైచిలుకు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.259.74కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా ఖమ్మంజిల్లాలో రైతుభరోసా కింద రబీలో 62,561మంది రైతులకు రూ.178.95కోట్లను నేటికీ చెల్లించలేదు. గడిచిన మార్చి 31నాటికి తిరిగి మళ్లీ మే 31నాటికి పూర్తి స్థాయిలో రైతు భరోసా చెల్లిస్తామని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్రంలోని ఇతర మంత్రులు వాయిదాలపై వాయిదాలు పెడుతూ ప్రకటనలు చేశారు.

మళ్లీ మారిన ప్రభుత్వ స్వరం..

మే చివరి నాటికి రబీ వ్యవసాయ సీజన్ ముగిసింది. ఈ నెల మొదటి నుంచి ఖరీఫ్ వ్యవసాయ సీజన్ మొదలైంది. అయినా రబీలో నాలుగు ఎకరాలు పైబడిన రైతులకు రైతు భరోసా అందలేదు. ఆ భరోసా సొమ్ము గురించి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయలేదు. యాసంగిలోని పెండింగ్ రైతుభరోసా సొమ్ము చెల్లిస్తారా? లేదా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగి నాటి రైతుభరోసాకు మంగళం పాడి వానాకాలం వరకు మాత్రమే ఇస్తారా అనే దానిపై రైతులు గందరగోళంలో ఉన్నారు. ఇప్పటికైనా యాసంగి నాటి రైతుభరోసా డబ్బులు తమకిచ్చేలా ప్రభుత్వం ఓ ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇదేం విభజన?

(5వ పేజీ తరువాయి)

ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

నోటీస్ బోర్డుల్లో కానరానీ జీవో...

కొత్తగూడెం కార్పొరేషన్‌కు సంబంధించిన ముసాయిదాను ఈ నెల 4వ తేదీన కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు. డివిజన్ల ఏర్పాటు పాల్వంచ నుంచి ప్రారంభమవుతుండగా 1నుంచి 27 డివిజన్లు పాల్వంచ పరిధిలో ఏర్పాటు చేస్తుండగా కొత్తగూడెం పట్టణ పరిధిలో 29 డివిజన్లు, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను 4 డివిజన్లుగా ఏర్పాటు చేయనున్నారు. పాల్వంచ నుంచి డివిజన్లను ప్రారంభించి కొత్తగూడెం మీదుగా సుజాతనగర్ మండలంలో 4డివిజన్లను ఏర్పాటు చేసి అక్కడి నుంచి మళ్లీ కొత్తగూడెంలో మిగిలి ఉన్న సగభాగం డివిజన్లను విభజించేందుకు ముసాయిదా జాబితాను ప్రకటించారు. ఒక్కొక్క డివిజన్‌కు 2,250 నుంచి 2,450 మంది ఓటర్లు ఉండేలా విభజిస్తున్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో మొత్తం 1,34,019 మంది ఓటర్లు ఉన్నారు. అయితే డివిజన్ల విభజనపై ముసాయిదా కాపీని కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఉంచినా ఆ నోటీసు బోర్డులో ఒక్కరోజుకు మించి కనిపించలేదు. ఉద్దేశ్యపూర్వకంగానే నోటీసు బోర్డులో ఉన్న కాపీని కనిపించకుండా చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముసాయిదా కాపీలు లేకపోవడంతో ఏ డివిజన్ పరిధి ఎక్కడి వరకు ఉందో, ఏ ఇంటి నెంబర్ ఏ డివిజన్ పరిధిలోకి వస్తుందనే సమాచారం తెలియకపోవడంతో డివిజన్ల విభజనపై అభ్యంతరాలను ఎలా తెలపాలో అర్థం కావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని శాస్త్రీయపద్ధతిలో డివిజన్లు విభజించాలని అన్ని పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

నాడు కళ కళ.. నేడు వెలవెల



పాలేరు జలాశయం

- జలపుష్పాల వేట కటకట
- అరకొరగానే చేపల షికారు
- మత్స్య అధికారుల నిర్లక్ష్యం

కూసుమంచి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయంలో జలపుష్పాల లేమితో వెలవెలబోయింది. రొయ్యలు లేకపోవడం, చేపల వేట తగ్గడంతో ఈపరిస్థితి నెలకొంది. కొన్ని దశాబ్దాలుగా వేసవి వచ్చిందంటే మంచినీటి రొయ్యల, చేపల ఎగుమతితో కళకళలాడిన జలాశయం.. నేడు చేపల షికారు ఆ జాడలేకుండా పోయిం ది. జలాశయాన్ని నమ్ముకుని బతుకుతున్న సుమారు వెయ్యికుటుంబాల ఆదాయానికి భారీగా గండిపడింది. సుమారు రూ.5కోట్ల విలువైన ఆదాయాన్ని కోల్పోయారు. వర్షాకాలం వచ్చిందే తడవుగా కోట్ల చేపపిల్లలు చెరువుల్లో వదులుతున్నట్లు ఫొటోలకు పోజులిస్తున్న ప్రజాప్రతినిధులు ఆతర్వాత అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. దీంతో ఈయేడు సరైన షికారులేకపోవడంతో మత్స్యకారుల జీవనం ఈయేడు దుర్భలంగా మారి అరకొర చేపలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

పాలేరు జలాశయంలో ముఖ్యంగా రొయ్యల వేట ఎక్కువగా సాగుతుంది. ఇక్కడ లభించేది మంచినీటి రొయ్య కావడంతో ఈరొయ్యలకు విదేశాల్లో ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఏప్రిల్ నెలలో పాలేరు జలాశయం నుంచి సాగర్ ఆయకట్టుకు నీటిని నిలిపివేసిన అనంతరం షికారు మొదలవుతుంది. సుమారు నాలుగు నెలలు షికారు జరుగుతుంది. ఖమ్మం జిల్లా మత్స్యకారులే కాకుండా పరిసర సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన మత్స్యకారులు కూడ ఇక్కడ చేపల, రొయ్యల వేట సాగిస్తుంటారు. జలాశయంలో పెంచే తెల్ల చేపపిల్లలను ప్రభుత్వం ఖర్చు భరిస్తుండేది. రొయ్యపిల్లలను గత దశాబ్దాలుగా ఆంధ్రప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్, సొంత ఖర్చుతో వెచ్చించి వదులడం ఆనవాయితీగా వస్తుండేది. ఏటా సుమారు 40 బండ్లలో 10లక్షల స్కాంబియా రకానికి చెందిన రొయ్యపిల్లలను (రూ.20లక్షలు) వదులుతుండేవారు. ఇవి పెరిగిన అనంతరం వేటాడే సమయంలో రొయ్యలను మత్స్యసొసైటీతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం జాలర్లు కాంట్రాక్టరికే విక్రయించేవారు. ఏగ్రేడ్ రకం రొయ్యలను రూ.250కు, బీ గ్రేడ్‌రకం 200కు విక్రయిస్తుంటారు. అదేవిధంగా మత్స్యకారులు రొయ్యలు, చేపల వేటకు అవసరమైన సామగ్రిని తయారు చేసుకునేందుకు కొంత పెట్టుబడులు పెడుతుంటాడు. ఇప్పుడు కాంట్రాక్టర్ రాకపోవడంతో రొయ్యపిల్లలను వదలడం లేదు.

మంత్రి ఆదేశించినా అధికారుల నిర్లక్ష్యం

చేపపిల్లలను వదిలేందుకు గత ఏడాది ఆగస్టులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు వచ్చారు. పలువురు మత్స్యకారులు రొయ్యపిల్లలు వదలాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి పొంగులేటి.. అందుకు తగిన ప్రతిపాదనలు పంపి రొయ్యపిల్లలను వదలాలని ఆదేశించారు. మత్స్యశాఖ అధికారులు మంత్రి ఆదేశాలను సైతం బేఖాతరు చేశారు. రొయ్యపిల్లలను వదలకపోవడంతో.. మత్స్యకారుల కడుపు నిండేపరిస్థితి లేకుండా పోయింది.

మత్స్య అధికారుల తీరుపై ఆగ్రహం

మత్స్యశాఖ అధికారుల తీరుపై జాలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ అభ్యున్నతికి పాటుపడాల్సిన అధికారులు అక్రమాలకు పాల్పడుతుండటం, తక్కువ పిల్లలను వదిలి లెక్కల్లో ఎక్కువగా చూపించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం తెల్లచేపపిల్లలను మాత్రమే వదిలి చేతులు దులుపుకొన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవికూడ ప్రభుత్వం నుంచి మంజూరయినంత వదలేదని అందులోనూ అధికారులు.. కాంట్రాక్టర్‌లతో అవకతవకలకు పాల్పడుతున్నారని తెలిపారు.



రొయ్యలు

మత్స్యసహకార సంఘానికి ఎన్నికలు జరిగేనా..?

పాలేరు మత్స్యసహకారసంఘానికి ఎన్నికలు లేక పదేళ్లయింది. 2015లోనే పదవీకాలం ముగిసినప్పటికీ నేటివరకు ఎన్నికలు నిర్వహించాలేదు. ప్రస్తుతం గతంలో ఉన్న కమిటీనే తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. మత్స్యసొసైటీ బలంగా లేదని, సమస్యలు ప్రభుత్వం దృష్టికితీసుకెళ్లి చర్యలు తీసుకోవాల్సి ఉండగా సొసైటీ బాధ్యులు ఆదిశలో చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు.



ఖమ్మంలో చేపలు విక్రయిస్తున్న దృశ్యం

మేఘాల మేళంతో.. మృగశిర ఆగమనం

- కార్తె రాకతో వర్షాల వల్ల వాతావరణంలో మార్పులు
- ప్రారంభంకానున్న వ్యవసాయ పనులు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్7(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసే, సాగుపనులకు అనుకూలండా ఉండే మృగశిర కార్తె నేడు ఆదివారం నుంచి ప్రారంభం అవుతుంది. మృగశిర కార్తె అనగానే తొలుత గుర్తుకు వచ్చేది చేపలు. ఈ కార్తె ఆరంభం రోజున చేపలు తినటం ఆనవాయితీగా వస్తుంది. మృగశిర కార్తెతో వేసవి కాలం దాదాపు ముగిసి వర్షాకాలం మొదలైందని భావిస్తారు. వర్షాకాలానికి నాంది పలికే మృగశిర కార్తెతో రైతుల్లో సందడి మొదలవుతుంది. వానకాలం పంటల సాగు కోసం ఉగాది తర్వాత దుక్కిదున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు రోహిణి కార్తెలో కురిసే మోస్తరు వర్షాలకు ఆరుతడి పంటలైన కందులు, పెసర్లు వేయడం ఆనవాయితీ. అయితే ఈ సారి ముందే వర్షాలు కురియడంతో రైతులు విత్తనాలు వేస్తున్నారు. జూన్ మొదటి వారంలో వచ్చే మృగశిర కార్తె సందర్భంగా రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుడతారు. అప్పటి వరకు వేసవి ఉక్కబోత వల్ల సతమతమైన ప్రజలు మృగశిర కార్తెలో పడే వానలకు వాతావరణం చల్లబడి ఉపశమనం పొందుతారు.

చేపల కొనుగోలు

మృగశిర కార్తె సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో ఒక రోజు ముందుగానే ప్రజలు చేపలను కొనుగోలు చేశారు. మృగశిర కార్తె ఆరంభం నుంచి వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు తగ్గి, వివిధ రకాల వ్యాధులు సక్రమించే అవకాశం ఉంటుందని, అందుకే చేపలు తింటారని పూర్వీకులు చెబుతున్నారు. బొచ్చెలు, బంగారు తీగ తదితర చేపలను విక్రయించారు. సాధారణ రోజులలో కిలో చేప రూ. 180 నుంచి రూ.200ల వరకు అమ్మే వ్యాపారులు మృగశిర కార్తె ఒక రోజు ముందు, కార్తె రోజు కిలో రూ. 250 నుంచి రూ. 300ల వరకు అమ్మకాలు సాగిస్తారు. మృగశిర ప్రారంభం రోజున ఖమ్మం నగరంలో సుమారు 50 నుంచి 60 టన్నుల చేపలు విక్రయించనున్నారు. చేపలు తినడం ద్వారా గుండె జబ్బులు, ఆస్తమా రోగులకు ఉపశమనం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చేపలను ఇంగువలో, చింతచిగురులో పెట్టి తీసుకుంటారు.



నాటు కోడి ధర రూ.1,200

మృగశిర కార్తె నేపథ్యంలో నాటుకోళ్ల ధరలు పెరిగాయి. రెండు కిలోలకు పైగా బరువున్న కోళ్ల ధర రూ.1,200గా ఉంది. ఫారం కోళ్ల లైవ్ ధర కేజీ రూ.170గా ఉండగా, చికెన్ కిలో రూ.240, స్కిన్‌లెస్ రూ.260గా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా నాటు కోళ్లను అధికంగా తింటారు. దీంతో కోళ్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. మృగశిర కార్తె రోజున తప్పని సరిగా మాంసాహారం తినాలనే ప్రచారం ఉండటంతో పాటు ఆదివారం కావటంతో ప్రజలు అధికంగా నాన్‌వెజ్ తినేందుకు ఇష్టపడుతారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



ఖమ్మం గొల్లగూడెం దర్గాలో ముస్లింల ప్రార్థనలు



కొత్తగూడెం ఈద్గాలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం ఖానాపురం హవేలి/ కొత్తగూడెం సాంస్కృతికం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను శనివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ముస్లింలు ఉదయాన్నే సామూహిక ప్రార్థనలు నిర్వహించుకోని ఒకరొనొకరు ఆలింగనం చేసుకోని ఎండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. తెల్లవారుజాము నుంచే మసీదులు, ఈద్గాలలో భారీగా ముస్లింలు చేరుకోని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖమ్మం నగరంతోపాటు వివిధ మండలాల్లోని గ్రామాలలో బక్రీద్‌ను జరుపుకొన్నారు. కుటుంబ సభ్యులు అందరూ నూతన వస్త్రాలను ధరించి వేడుకలను జరుపుకొన్నారు.

కొత్తగూడెం ఈద్గాలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషాలు హాజరై ముస్లింలకు బక్రీదు శుభాకాంక్షలు తెలిపి అలింగనం చేసుకున్నారు.కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేట, పినపాకలోబక్రీదు వేడుకలను జరుపుకొన్నారు. ఇందిరాకాలనీ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. మసీదు ఉమర్ పరూక్ అహలే హదీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బక్రీద్ పండుగకు ఇస్లామిక్ పవిత్ర గ్రంథాలలో విశేష ప్రాధాన్యం ఉంది. హజరత్ ఇబ్రహిం అల్లాహహెకు తన కుమారుడిని త్యాగం చేయటానికి సిద్ధపడ్డాడు. దీనికి గుర్తుగా ముస్లింలు బక్రీద్‌ను జరుపుకొంటున్నారు. ఈ పండుగ రోజున ఆర్థికంగా ఉన్నవారు మాంసాన్ని కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, పేదలకు పంచిపెట్టారు. ఖమ్మం నగరంలోని గొల్లగూడెం, గాంధీచౌక్ ఈద్గాల వద్ద తెల్లవారు నుంచే ముస్లింలు పెద్ద సంఖ్యలో సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మానవత్వం, శాంతి, సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని ముస్లిం మత పెద్దలు యువతకు సూచించారు.

పాత కక్షలతో యువకుడి హత్య



సతీష్(ఫైల్)

భద్రాచలం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో పాత కక్షల నేపథ్యంలో చోటు చేసుకున్న వివాదంలో ఒక యువకుడు హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. రెండేళ్ల క్రితం ఏఎస్ఆర్ కాలనీకి చెందిన కణితి సతీష్, జగదీష్ కాలనీకి చెందిన గుంజా సాయిరాంకు వినాయక చవితి నిమజ్జనం సమయంలో గొడవ జరిగింది. నాటి నుంచి తరచూ ఇరువురు ఎదురుపడిన సమయంలో బెదిరించుకునేరు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఏపీలోని మేడువాయి సమీపంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకోగా ఏపీ పోలీసులు వచ్చి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఈ క్రమంలో సాయిరాం శనివారం ఉదయం కణితి సతీష్ ఇంటికి కొంత మందిని తీసుకెళ్లి ఘర్షణకు దిగాడు. ఈ సమయంలో సతీష్‌ను ఇంట్లోనే దారుణంగా కొట్టి కత్తులతో పొడిచారు. ఈ క్రమంలో అతని సోదరుడు రమణ అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిపై సైతం కర్రలతో దాడి చేశారు. ఈ నేపథ్యంలో గమనించిన స్థానికులు సతీష్, అతని సోదరుడిని హుటాహుటిన భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే సతీష్ మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. భద్రాచలం సీఐ నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా హత్య ఘటనలో కీలక నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సాయిరాంను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

బాలికపై లైంగిక దాడికి యత్నం

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

చింతకాని, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఓ పన్నెండేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నం చేసిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసిన సంఘటన శనివారం చింతకాని మండలంలో జరిగింది. ఖమ్మం నగరం కొత్తగూడెం డివిజన్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ అనే యువకుడు కొంతకాలంగా చింతకాని మండలంలోని ఓ గ్రామంలో నివసిస్తూ అక్కడే పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో రోజూ అతడు నివాసం ఉండే ప్రాంతంలోని ఓ ఇంట్లో పాలు తీసుకుంటూ ఉంటాడు. రోజూలాగే శనివారం ఉదయం కూడా పాల కోసమని వెళ్లిన ఆ యువకుడు ఇంట్లో ఉన్న బాలికపై లైంగికదాడికి ప్రయత్నించాడు. ఆ బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారొచ్చి అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దీంతో అతడిపై పోక్సో కేసు నమోదు చేసి.. అరెస్టు చేశామని వైరా సీఐ సాగర్ తెలిపారు.

బర్లీఫిట్‌లో చైన్ స్నాచింగ్

కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, జూన్7 (ఆంధ్రజ్యోతి): బర్లీఫిట్ ప్రాంతంలో చైన్ స్నాచింగ్ శనివారం కలకలం రేపింది. భయాందోళనకు గురైన మహిళ కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనకు సంబంధించి వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం పట్టణంలోని బర్లీఫీట్ ఏరియాలో శ్రీపాద పద్మ అనే మహిళ ఉదయం ఐదు గంటలకు రోజు మాదిరిగానే ఇంటి పనులలో చేయడంలో నిమగ్నమైంది. ఈ సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి తన చేతిలో ఉన్న గుడ్డతో నోరు మూసి మెడలో ఉన్న 15 గ్రాముల బంగారు తాళిబొట్టు పుస్తెలతాడు బలవంతంగా లాగేసుకొని పారిపోయాడు. దీంతో ఆ మహిళ గట్టిగా కేకలు వేసింది. స్థానికుల సహాయంతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా వన్‌టౌన్ మహిళా ఎస్ఐ విజయ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి?

చుంచుపల్లి, జూన్7(ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం చుంచుపల్లి మండలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఓ వ్యక్తి వైద్య చికిత్స పొందేందుకు వెళ్లి మృతి చెందడంపై సోషల్ మీడియాలో శనివారం హల్‌చల్ అయింది. నడుముకు శస్త్ర చికిత్స చేసుకునేందుకు వచ్చిన ఆ రోగికి సరైన వైద్యం అందకనే మృతి చెందాడని, మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగినట్లు తెలిసింది. చుంచుపల్లి పోలీసులు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.


చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్..

ఖమ్మం రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఏదులాపురం గ్రామానికి చెందిన ఎర్ర నరేందర్ రెడ్డి(36) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీ శుక్రవారం ఆరెకోడు గ్రామం నుంచి తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని ఖమ్మం వస్తుండగా మార్గమధ్యలో ముత్తగూడెం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. దీంతో నరేందర్ రెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నరేందర్ రెడ్డి శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. జరిగిన సంఘటనపై నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ రాజు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఆత్మహత్యకు యత్నించిన మహిళ..

బూర్గంపాడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బూర్గంపాడు మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన బోయిన రాంబాయమ్మ(69) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. శుక్రవారం తన ఇంట్లో పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబసభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుల సూచన మేరకు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతురాలి భర్త రాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాంతకం.. బ్రెయిన్ ట్యూమర్



- కణితిని తిప్పికొడదాం..
- ఉమ్మడి జిల్లాలో 4వేల మంది వరకు బాధితులు
- వంశపారం పర్యంగా వచ్చే అవకాశం
- పనిప్రదేశాలు కూడా కారణం అవుతాయి
- కొందరిలో ఎలాంటి కారణాలు లేకుండానే ప్రైమరీ ట్యూమర్‌లు
- జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యం
- ఆధునిక వైద్యసేవలతో నివారణ సాధ్యం

నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవన విధానంతో బ్రెయిన్ ట్యూమర్ కేసులు పెరుగుతున్నాయి. అవగాహనతోనే వాటిని తిప్పికొట్టొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వాస్తవానికి మెదడులో ఎప్పటికప్పుడు పాత కణజాలాల స్థానంలో కొత్త కణజాలాలు నిరంతరాయంగా జనిస్తుంటాయి. ఈ క్రమంలో పాత కణజాలాలు మెదడులో అలాగే ఒక చోటకు చేరితే కణితి ఏర్పడుతోంది. కొంతమంది రోగుల్లో ఎలాంటి కారణాలు లేకుండా ప్రాణాపాయం లేని ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్ వ్యాపిస్తోంది. తద్వారా శరీరంలోని ఛాతి, లీవర్, ఊపిరితిత్తులు ఇలా పలు అవయవాల నుంచి రక్త సరఫరా కారణంతో ప్రాణాంతకమైన సెకండరీ బ్రెయిన్ ట్యూమర్ వ్యాపిస్తోంది. ధూమపానం, అధికంగా మద్యం సేవించటం కూడా బ్రెయిన్ ట్యూమర్‌కు దారితీస్తోంది. సాధారణంగా నడివయస్సుల వారికి బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి లక్షణాలు బయటపడ్తుంటాయి. జూన్ 8న ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

రెండు రకాల బ్రెయిన్ ట్యూమర్‌లు

డినైన్ ట్యూమర్స్: మెదడులోని కణాల సృష్టి నిరంతరాయంగా జరుగుతోంది. ఈ క్రమంలో పాత కణాలు పూర్తిగా తొలగిపోకుండా కొన్ని కణాలు మెదడులో మిగిలి ఉండి ఒక కణితిలా ఏర్పడటం. ఇది ప్రమాదం కాదు, మందులు, ఇతర శస్త్ర చికిత్సలు ద్వారా పూర్తిగా నయం అవుతోంది. బ్రెయిన్ ట్యూమర్‌లో 60నుంచి 70శాతం వరకు ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్ కేసులు నమోదు జరుగుతాయి.

మొలైన్ ట్యూమర్స్: శరీరంలోని అవయవాల ద్వారా మెదడుపై ప్రభావం పడి దాని ద్వారా మెదడులో కణజాల సృష్టి, పాత కణజాలాలు కణితి ఏర్పడటం. ఇది చాలా ప్రమాదకరం.

ముఖ్యంగా శరీరంలోని మూత్రపిండాలు, కాలేయం(లీవర్), ఛాతి, ఇతర అవయవాల ద్వారా మెదడుకు వ్యాపించి కణితి ఏర్పడుతోంది. చాలా ప్రమాదకరమైనది. ఉమ్మడి జిల్లాలో 4వేల వరకు ట్యూమర్ కేసులు ఉన్నాయి. 40శాతం సెకండరీ బ్రెయిన్ ట్యూమర్ కేసులు నమోదు జరుగుతున్నాయి.

లక్షణాలు ఇలా..

తలనొప్పితో లక్షణాలు ప్రారంభం అవుతాయి. తలనొప్పితో వాంతులు, పిట్స్ రావటం, కంటిచూపు తగ్గటం, వినికిడి శక్తి తగ్గటం(చెవుడు)ఒకవైపుగా కాలు, చెయ్యి పడిపోవటం, మూతి ఒంకర పోవటం, మతిస్థిమితం కోల్పోవటం, జ్ఞాపకశక్తి తగ్గటం, సరైన నిర్ణయాలు తీసుకోలేక పోవటం,నిత్యం చేసే పనులు జాప్యం చేయటం, నిత్యం చేసే పనులు బద్ధకంగా ఉండటం, శరీరంలో ఒక బాగం అవయవాలపై అనాసక్తిగా ఉండటంశ్వాస, ఆహారం, ఇతర పదార్థాలు తినటంలో కష్టంగా ఉండటం, మాటలు తడబడటంలాంటివి గుర్తిస్తే బ్రెయిన్‌ట్యూమర్‌గా గుర్తించాలి. ట్యూమర్ వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉంటుంది. పలు రకాల రేడియేషన్‌ల కారణంగా, మితిమీరిన సెల్‌ఫోన్‌ల వినియోగం, న్యూరో ఫైబ్రోరో మ్యాట్రిసిస్‌ల వల్ల కూడా కణతులు రావచ్చు.

జాగ్రత్తలు పాటించండిలా..

బ్రెయిన్ ట్యూమర్ వంశపారంపర్యంగా ఉంటే 35ఏళ్ల వయస్సుదాటిన తర్వాత ఒక సారి ఎంఆర్ఐ స్కానింగ్ చేయించుకోవాలి. ఎక్కువగా రేడియేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తినే ఆహారంలో పండ్లు కూరగాయలు, అధికంగా తీసుకోవాల్సి ఉంటుంది. 50ఏళ్ల తర్వాత తలనొప్పిని అజాగ్రత్త చేయకూడదు. మద్యానికి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి.

ప్రాథమిక దశలోనే గుర్తించాలి

- డాక్టర్ చైతన్య, న్యూరో వైద్యుడు



మెదడులో కణితులను తొలగించడానికి అత్యాధునిక చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అయితే దీనిపై అవగాహన కూడా ప్రజలకు అవసరం ఉంది.ముందస్తుగానే లక్షణాలు గుర్తిస్తే వ్యాధిగ్రస్తుల జీవితకాలం పెంపు జరుగుతుంది. మూడు, నాల్గు దశలో ఉన్న బ్రెయిన్ ట్యూమర్ చాలా ప్రాణాంతకమైనది. అపరేషన్నే బ్రెయిన్ ట్యూమర్‌కు సరైన వైద్యం. జిల్లాలో బ్రెయిన్ ట్యూమర్‌లు నమోదవుతూనే ఉన్నాయి. హైపర్ ఇంట్రా ఆపరేషన్ మైక్రోస్కోప్, ఇంట్రా ఆపరేటివ్ న్యూరో నావిగేషన్, న్యూరల్ మానిటరింగ్ వంటి ఆధునిక విధానాలు కణితులను తొలగించడానికి సురక్షితంగా పనిచేస్తున్నాయి.

గోదావరిలో మునిగి బాలుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భద్రాచలం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరిలో హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన స్వప్న ధనుంజయ దంపతుల కుమారుడు అఖిల్ గౌడ్(8) లోతును అంచనా వేయలేక గల్లంతై మృతి చెందాడు. ధనుంజయ స్వప్నతో పాటు 13 మంది శుక్రవారం హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లి అక్కడ అమ్మవారిని దర్శించుకొని శనివారం భద్రాచలం వచ్చారు. ఈ క్రమంలో గోదావరిలో స్నానాలు చేస్తుండగా అఖిల్ లోతును అంచనా వేయలేక గల్లంతయ్యారు. ఈ క్రమంలో గజఈతగాళ్లు అతన్ని కాపాడేందుకు ప్రయత్నించగా అప్పటికే అతను మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం విషాదంలో మునిగింది. అఖిల్ మృతదేహానికి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై వి.సతీష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన ఛత్తీస్‌గఢ్ యువకుడికి శస్త్ర చికిత్స

- ట్రాక్టర్ బోల్తా పడి తీవ్ర గాయాలు

భద్రాచలం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా రాయగూడెం గ్రామానికి చెందిన సోడి సన్నాకు శనివారం మూడు గంటల పాటు వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించారు. శుక్రవారం రాత్రి ట్రాక్టరు బోల్తా పడిన ఘటనలో సన్నాకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. దీంతో అతణ్ని రాయగూడెం నుంచి భ ద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. సన్నాను పరీక్షించిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దేవరాజ్ మూడు గంటల పాటు శస్త్ర చికిత్స నిర్వహించారు. కాగా ఎంతో క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతం చేసిన డాక్టర్ దేవరాజ్‌ను సహకరించిన సిబ్బందిని సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంవో డాక్టర్ వై రాజశేఖర్‌రెడ్డి అభినందించారు.

గట్టయ్య సెంటర్‌లో ఘర్షణ

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్7(ఆంధ్రజ్యోతి): నగరంలోని గట్టయ్య సెంటర్‌లోని ఓ టీస్టాల్ వద్ద వాహన పార్కింగ్ విషయమై జరిగిన ఘర్షణపై కేసు నమోదైంది. ఖమ్మం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ దీన్ని ధ్రువీకరించారు. గట్టయ్య సెంటర్‌లో వాహన పార్కింగ్ విషయమై దుకాణాదారులకు, ఇతరులకు ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై ఇరువర్గాలు ఫిర్యాదు చేశాయి. దుకాణానికి చెందిన ముగ్గురు వ్యక్తులతో పాటు ఘర్షణ పడిన ముగ్గురు వ్యక్తులపై కూడా శుక్రవారం అర్ధరాత్రి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఐదు క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

చుంచుపల్లి, జూన్7 (ఆంధ్రజ్యోతి): ప్యాసింజర్ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాల రేషన్ బియ్యంను కొత్తగూడెం టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. గరీబ్‌పేట్ త్రీ ఇంక్లైన్ మార్గంలో వెళుతుండగా టూటౌన్ సీఐ ప్రతాప్ తన సిబ్బందితో టీఎస్28 టీ0261 నెంబర్ గల ఆటోను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. నర్సింగ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

చుంచుపల్లి, జూన్7(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం పట్టణంలోని రామవరం సీఆర్పీ క్యాంపులకు చెందిన 63 సంవత్సరాల వయస్సు కలిగిన ఎస్‌కే యూసఫ్ అదృశ్యమవగా కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదు అయింది. ఇతను గత నెల రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఉన్నాడని వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కుమారుడు ఎస్‌కే .పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ సీఐ ప్రతాప్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వేంసూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందగా మరో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన సంఘటన శనివారం వేంసూరు మండలంలోని కందుకూరు-మర్లపాడు గ్రామాల మధ్య చోటు చేసుకుంది. భరణిపాడు గ్రామానికి చెందిన మల్లెపూల సాత్విక్(22), సురటి జగదీష్, విస్సంపల్లి జస్వంత్‌లు ద్విచక్రవాహనంపై మర్లపాడు వస్తుండగా తిరువూరు నుంచి కందుకూరు వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాత్విక్ అక్కడికక్కడే మృతిచెందగా జగదీష్, జస్వంత్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో జగదీష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

ఆవుల తరలింపు అడ్డగింత

ఇల్లెందు టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణంలోకి వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ఆవులను హిందూ ఐక్యవేదిక నాయకులు అడ్డుకుని శనివారం పోలీసులకు అప్పగించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లే ఆవులను పట్టణంలోని స్టేషన్‌బస్తీ, 24 ఏరియా తదితర ప్రాంతాలు హిందు ఐక్యవేదిక నాయకులు అడ్డుకున్నారు. లారీల్లో తీసుకొచ్చిన ఆవులను విడిపించి ఖమ్మంలోని ఓ గోశాలకు తరలించారు. ఇల్లెందు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఆవులను తరలించారు.

సూరారంలో కోళ్లఫారం నేలమట్టం

జూలూరుపాడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సానికి మండలంలోని సూరారం గ్రామంలో మాలోత్ సురేష్‌కు చెందిన కోళ్ల ఫారం నేలమట్టమయ్యింది. దీంతో కోళ్లఫారంలో ఉన్న సుమారు 4వేల కోడిపిల్లలు మృత్యువాత పడ్డాయి. వీరన్నకు చెందిన కోళ్లఫారాలను సురేష్ లీజుకు తీసుకుని కోళ్లను పెంచుతున్నాడు. పదిరోజుల క్రితం 12వేల కోడిపిల్లలను తెచ్చి రెండు కోళ్ల ఫారాలలో పెంచుతున్నాడు. వర్షానికి షెడ్ పూర్తిగా నేలమట్టమైంది.

ఉద్యోగ అవకాశములు

జీతము : రూ॥ 15,000/- నుండి 20,000/- వరకు

ఆపరేషన్ థియేటర్ సహాయకులు
కంటి లేదా ఇతర ఆసుపత్రులలో ఆపరేషన్ థియేటర్‌లో పనిచేసి అనుభవము కల స్త్రీ / పురుషులు

కంప్యూటర్ ఆపరేటర్లు
ఆరోగ్యశ్రీ పనిలో / ఇతర డేటా ఆపరేటర్లుగా కలిగిన స్త్రీ / పురుషులు

VISION TECHNICIANS
నేత్ర వైద్యసహాయులుగా శిక్షణ పొంది, అనుభవము కల స్త్రీ / పురుషులు

ACCOUNTANT
విద్యార్హత, అనుభవము కల స్త్రీ / పురుషులు

Bio-Medical Equipment Technicians
Polytechnic / B.Tech Instrumentation / Electronics పూర్తిచేసి, Bio-Medical Equipment నిర్వహణ ఉపాధిలో ఆసక్తి కల స్త్రీ / పురుషులు

మీ పూర్తి వివరములు గల బయోడేటాతో స్వయంగా 10-06-2025న మధ్యాహ్నం 3:00 గం॥లకు క్రింద తెలిపిన అడ్రస్ నందు సంప్రదించగలరు

అఖిల కంటి ఆసుపత్రి
better vision...better life...
E- mail ID : hr@akhilaeye.in
భవాని మెస్ ఎదురుగా, నెహ్రూనగర్, ఖమ్మం.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

WANTED
Staff for reputed Homeopathy clinic khammam, Homeopathy Doctors (BHMS/MD)-2 Receptionist (any Degree)-2 Manager - 1
Contact: 9502755595.
AJM-13478

ఇల్లు అమ్మబడును
★ ఖమ్మం పట్టణంలో, శాంతి నగర్, మిషన్ హాస్పిటల్ ఎదురుగ 500గ॥ విస్తీరణంలో, 250॥ ఇల్లు, 250గ॥ ఖాళీ స్థలంతో అమ్మబడును. సం॥ప్ర॥ 7981828101
AJW-237345

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, నష్టములేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

స్వాగతం/వీడ్కోలు | పుట్టిన రోజు | వివాహ వార్షికోత్సవం
షష్టిపూర్తి | లీగల్ నోటీసులు | శ్రద్ధాంజలి
పదవీవిరమణ | వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు

4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only

ఖమ్మం : 9985401672

ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347

గంగమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ

నేలకొండపల్లి,జూన్7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గువ్వలగూడెంగ్రామ సమీపంలోని శ్రీగంగమ్మతల్లి విగ్రహ, దేవాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. సూర్యాపేట జిల్లా కోదాడ మాజీఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని, ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. యాదవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తొలుత గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.



పూజలో పాల్గొన్న కోదాడ మాజీ ఎమ్మెల్యే

సమాజాన్ని నడిపించేది గురువులే

- ఖమ్మం సీపీ సునీల్‌దత్
- రామచంద్రాపురంలో రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

నేలకొండపల్లి, జూన్7 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని నడిపించేది, సమాజానికి మార్గనిర్దేశనం చేసేది గురువులేనని సీపీ సునీల్ దత్ అన్నారు. వివిధ హోదాల్లో, వివిధ డిపార్టుమెంట్లలో పని చేసి రిటైరైన రామచంద్రాపురం గ్రామానికి చెందిన వారిని శనివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మంసీపీ సునీల్‌దత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశ్రాంత ఉపాధ్యాయుడు పిన్నెబోయిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులను గ్రామస్తులందరూ కలిసి సన్మానించుకోవటం ఓకొత్త ఒరవడికి నాంది అన్నారు. చిన్న గ్రామంలో పెద్ద అధికారులతో పాటుగా చిన్న అధికారులు ప్రధానంగా ఎక్కువగా ఉపాధ్యాయులు ఉండటం విశేషమన్నారు. మెదక్ ఎస్పీగా పని చేస్తూ రిటైరైన దేవరపల్లి ఉదయ్‌కుమార్‌రెడ్డితో తనకున్న అనుబంధం మర్చిపోలేని దన్నారు. తాను ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి పని చేసానని, ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నానన్నారు. వివిధ ఉద్యోగాలు చేసి రిటైరైన 36 మందిని సీపీ సన్మానించారు. విశ్రాంత ఐపీఎస్ కంభంపాటి శ్యాంప్రసాద్, విశ్రాంత ఎస్ఈ, పుల్లారెడ్డి, విశ్రాంత ఆర్ఎం, ఎస్‌బీఐ, శివసాంబిరెడ్డి,విశ్రాంతసీఐ తుమ్మల లక్ష్మయ్య, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి లింగా వెంకట్రామిరెడ్డి,ఎస్.వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వరరావు విశ్రాంత ఉపాధ్యాయులు సీపీ సన్మానించారు.కార్యక్రమాన్ని దేవరపల్లి బ్రదర్స్, బెజవాడ శ్రీనివాసరెడ్డి నిర్వహించారు.



విశ్రాంత ఉద్యోగుల సన్మాన సభలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్7 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలను శనివారం విడుదల చేశారు. పదో తరగతిలో మొత్తం 596మంది పరీక్షకు హాజరుకాగా 241 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్‌లో 839 మంది పరీక్షకు హాజరుకాగా 486 మంది ఉత్తీర్ణత సాధించారని జిల్లా విద్యాశాఖ అధికారి కె. సత్యనారాయణ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పాపారావులు తెలిపారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కావాల్సిన వారు ఈనెల12నుంచి 18 లోపు ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల్లో ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఏడు పదుల వయస్సులో ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాసిన వట్టికూటి.సత్యనారాయణ 500ల మార్కులకు 420 మార్కులు సాధించాడు.

చింతకానికి చేరుకున్న యువ చైతన్య సైకిల్ యాత్ర

చింతకాని,జూన్7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో మినీ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యువ చైతన్య సైకిల్ యాత్ర ఏడోరోజు చింతకానికి చేరుకుంది.

జవాన్లు.. మామూళ్లు

- కాసులు ఇచ్చే కమర్షియల్ ప్రాంతాల్లోనే శుభ్రత
- సాధారణ నివాసాలకు వెళ్లని వైనం
- శుభ్రం కాని వీధులు, డ్రెయినేజీలు
- ప్రశ్నించిన ప్రజలపై గొడవకు దిగుతున్న జవాన్లు

ఖమ్మం సంక్షేమవిభాగం, జూన్7(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య జవాన్లు మామూళ్ల మత్తుకు అలవాటు పడ్డారు. గతంలో ఈ పరిస్థితి లేకున్నా.. రానురాను ఇది తీవ్రరూపం దాల్చుతోంది. గతంలో కొన్ని డివిజన్లకే పరిమితమైన అవినీతి విధానం.. వైరల్‌లా నగరంలోని అన్నిడివిజన్లకు వ్యాపిస్తోంది. రాష్ట్రంలోనే వేగంగా అభివృద్ధి చెందే నగరంలో ఖమ్మం ముందు వరసలో ఉంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో నగరంలోని విలీన ప్రాంతాలకు రహదారులు, మౌళిక సౌకర్యాలను పెంచుతున్నారు. ఈ క్రమంలో నగరానికి సరిహద్దులో ఉన్న డివిజన్లు, బైపాస్‌కు అనుబంధంగా ఉన్న డివిజన్లు, పాత బస్టాండ్ సమీపంలోని డివిజన్లులో కమర్షియల్ మాల్స్ హాస్పటల్స్, వ్యాపార సంస్థలు పెరిగాయి. అయితే ప్రాంతాలతో సంబంధం లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాల్సిన కొంత మంది జవాన్లు కేవలం కమర్షియల్ ప్రాంతంలోని వ్యాపారుల దుకాణాలకే పరిమితమైతున్నారు. వారి నుంచి ప్రతీనెలా నిర్ణీత మొత్తంలో మామూళ్లను తీసుకుంటున్నారు.

ప్రశ్నిస్తే దూషణలు

హాస్పటల్స్, కిరాణం, మాంసం దుకాణాలు ఇలా ప్రతీకమర్షియల్ వ్యాపారుల వద్ద నెల మామూళ్లకు అలవాటు పడ్డారు. గతంలో ఇటువంటి విధానం కొన్ని డివిజన్లుకు పరిమితం కాగా ఇప్పుడు అనేక డివిజన్లకు వ్యాపించింది. జవాన్లు ఎక్కువగా కమర్షియల్ ప్రాంతాలకు పారిశుధ్య కార్మికులను వినియోగించటంతో సాధారణ ప్రజల నివాసాలకు, స్లమ్ ఏరియాలకు వెళ్లటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. ఎవ్వరైనా ప్రజలు జవాన్లను ప్రశ్నిస్తే వారిపై వ్యక్తిగత దూషణలు చేసే స్థాయిలోకి జవాన్లు చేరారు. రాజకీయంగా పలుకుబడి కలిగిన జవాన్లతో పాటుగా ఇప్పుడు అనేక మంది కార్పొరేటర్లకు జవాన్లు ఏజెంట్లుగా మారారని ఆరోపణలు వ్యాపిస్తున్నాయి. ఒక్క జవాన్‌ను అధికారులు పక్క డివిజన్‌కు మారిస్తే ఏకంగా కేఎంసీ అధికారుల పైనే ఫిర్యాదు చేసే స్థాయికి ఖమ్మం నగర పాలక సంస్థలోని జవాన్ల వ్యవస్థ బలోపేతమైంది. రాజకీయ వత్తిడులు అధిగమించి నగరంలో మూడేళ్లకు పైగా ఒకే డివిజన్‌లో పనిచేస్తున్న జవాన్లను ఇతర ప్రాంతాలకు మార్చకుంటే భవిష్యత్‌లో కేఎంసీ అధికారులకు జవాన్ల వ్యవస్థ ఛాలెంజ్‌గా మారే పరిస్థితి కనిపిస్తోంది.



శుభ్రం కాని డ్రెయినేజీ

11న అఖిల భారత ఐక్య రైతు సంఘం ప్రథమ మహాసభలు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైతు కూలీల సమస్యలపై ఐదు దశాబ్దాలుగా పోరాటాలు చేసిన అనేక హక్కులు, విజయాలు సాధించిన అఖిల భారత ఐక్య రైతు సంఘం ప్రథమ మహాసభ ఈ నెల 11న ఖమ్మంలో జరగనున్నది. శనివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య ఈ వివరాలు వెల్లడించారు. నాయకులు అఖిల భారత ఐక్య రైతు సంఘం కరపత్రాలను విడుదల చేశారు. ఈ మహాసభల్లో నిర్దిష్టమైన ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు, నాయకులు నాయకులు కొలేటి నాగేశ్వరరావు, కేలోత్ లక్ష్మణ్, పాశం అప్పారావు, కుర్ర వెంకన్న, వడ్డే వెంకటేశ్వర్లు, జరుపుల దేవ్లా పాల్గొన్నారు.

సెర్ప్‌లోలేని మహిళకు టీ దుకాణం

- మహిళా సభ్యుల స్థానంలో మహిళా మార్టు ఉద్యోగుల నిర్వహణ
- అద్దె ప్రాతిపదికను పరిశీలిస్తున్నాం: సన్యాసయ్య, డీఆర్డీవో

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఎంతో ఆదర్శంగా ప్రారంభించిన మహిళా స్వయం సహాయక సంఘాల టీ షాప్ పది రోజులు తిరగకముందే వివాదాలకు కారణమైంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిదిలోని సెర్ప్‌కు జిల్లా సమాఖ్యలో 2లక్షల మంది మహిళ సభ్యులు ఉన్నారు. ఐనప్పటికీ ఎటువంటి సభ్యత్వం లేని మహిళకు టీ షాప్ కేటాయింపుతో వివాదాలకు కారణంగా తెలుస్తోంది. జిల్లా గ్రామీణాభివృద్ధిలోని జిల్లా సమైఖ్య నిర్వాహణకు టీషాప్‌నిర్వాహణ బాధ్యతలను అప్పగించారు. అయితే సెర్ప్ పరిదిలోని మహిళ సభ్యులకు మాత్రమే టీ షాప్ దుకాణం నిర్వాహణ చేయాల్సి ఉంటుంది.

తొలుత ఎంపిక .. ఆపై వద్దని

దుకాణం కోసం అధికారులు ముందుగా కసరత్తు చేశారు. టీదుకాణం నిర్వాహణలో అనుభవం ఉండి, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలిగా ఉంటూ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన రఘునాథపాలెం మండల కేంద్రానికి చెందిన గాజుల సౌజన్యను ఎంపిక చేశారు. డీఆర్డీవో కార్యాలయానికి పిలిపించి ఆ యువతీతో టీ, జావా పెట్టించి అనేక పరీక్షలు పెట్టారు. చివరకు సెలక్ట్ చేశారు. టీషాప్ ప్రారంభోత్సవం రోజు వారితో ప్రదర్శన చేయించారు. తర్వాత మాత్రం ఆ యువతిని కాకుండా ఖమ్మం నగరానికి చెందిన మహిళాతో టీ షాప్ నిర్వహణ చేపట్టారు. నిభందనల మేరకు సెర్ప్ పరిధిలో ఏర్పాటు చేసిన మహిళలకు జిల్లా సమైఖ్య పరిధిలోని మహిళలకు అవకాశం కల్పించాలి.

కనీసం సభ్యత్వం లేని వారు నిర్వహణ

ఇక్కడ మాత్రం ఎటువంటి సంబంధం లేని, మెప్మా అధికారులు, సిబ్బంది సిఫారసు చేయని, మెప్మాలో కనీసం సభ్యత్వం లేని జిల్లా పరిషత్ ప్రభుత్వక్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న మహిళకు డీఆర్డీవో టీషాపు కేటాయించారు. దీంతో వివాదాలకు కారణమైంది. వరస వివాదాలతో టీషాపు గొడవలకు కేరాఫ్‌గా మారటంతో చివరకు మహిళా మార్టులోని ఉద్యోగులు టీ షాపును నిర్వాహణ చేపట్టన్నారు. ఈ విషయంపై జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా టీ షాపు నిర్వాహణ ఎవ్వరికి పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు.అద్దెప్రాతిపదికన ఇచ్చేందుకు కార్యచరణ చేస్తున్నామన్నారు. జిల్లా సమైఖ్య పరిదిలో నిర్వాహణ జరుగుతుందన్నారు.



శిక్షణ పొందిన యువతి

బీవీకేకు రాయల విరాళం రూ.25వేలు

ఖమ్మంసంక్షేమ విభాగం,జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం వైద్యశిబిరాలు నిర్వహించి, మందులు పంపిణీ చేయటం అభినందనీయమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మంచికంటిభవన్‌లో బోడేపూడి విజ్ఞాన కేంద్రం, ఖమ్మం రెండో పట్టణ సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని రాయల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా బీవీకే ట్రస్టుకు రూ.25వేలు వితరణ చేశారు. ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్,నాయకులు వై.శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, శివనారాయణ,రామారావు, అఫ్జల్, పీ.వాసు, వాసిరెడ్డి వీరభద్రం,నాగేశ్వరరావు, సీహెచ్. భద్రం పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న రాయల

నగరంలో బడిబాట

ఖమ్మంఖానాపురంహవేలి,జూన్7(ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని ఎస్ఎస్‌సీ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా రమణగుట్ట, వికలాంగులకాలనీ, ప్రాంతాలలో బడిబాట నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు యలమద్ది వెంకటేశ్వర్లు, నారాయణరావు, రామారావు,ఉషాకుమారి, శ్రీదేవి, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు. 24వ డివిజన్ శాంతినగర్ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి హాజరయ్యారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

నేలకొండపల్లి, జూన్7(ఆంధ్రజ్యోతి): త్యాగాలకు ప్రతిరూపంగా నిలిచే బక్రీద్ పండుగను శనివారం మండల వ్యాప్తంగా ముస్లింలు అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. నేలకొండపల్లి, బోదులబండ, కోరట్లగూడెం, చెర్వుమాధారం గ్రామాల్లోని మజీదుల్లో ముస్లింలుప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నేలకొండపల్లి మజీద్ కమిటీ అధ్యక్షుడు యండి.మహబూబ్‌ఆలీ, కార్యదర్శి షేక్. సుభాన్ యండి.షాకీర్,షేక్.షర్ఫుద్దీన్, పఠాన్, భాష, యండి.వాజీద్, బోదులబండలో కాంగ్రెస్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్.ఖాజామియా, రాయగూడెంలో షేక్.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్‌ను శనివారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పలువురు వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సుబ్లేడు, మాదిరిపురం, జింకలగూడెం, తిరుమలాయపాలెం, బీరోలు, పిండిప్రోలు, సోలిపురం తదితర గ్రామాల్లో మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జింకలగూడెంలో బక్రీద్ వేడుకలలో ఎస్ఐ జగదీష్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఎస్‌డీ జియావుద్దీన్, ఎస్‌డీ ఇమాం, సైదా, ఇమాం, జబ్బార్, మదార్,బాషామియా తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఐ జగదీష్

పేదలందరికీ పక్కా గృహాలు

తిరుమలాయపాలెం, జూన్7(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేస్తుందని జిల్లా కాంగ్రెస్‌నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని సుబ్లేడులో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గుంజ యలమంద, సమన్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కరుణ, మెట్టు అనిల్, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని రఘునాథపాలెంలో ఇందిరమ్మ ఇళ్లకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకుడు ఓర వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పార్టీనాయకులు రామడుగు ప్రభాకరరావు,నిమ్మల వెంకన్న, గట్టు చంద్రయ్య, మల్లయ్య, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నగదు అందజేత

ఖమ్మంరూరల్,జూన్7(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలకు నగదు అందజేశారు. బారుగూడెం, ఏదులాపురం, గొల్లగూడెం, వరంగల్‌క్రాస్ రోడ్డు, మద్దులపల్లి, జలగంనగర్, నాయుడుపేట,కేబీఆర్‌నగర్, రాజీవ్ గృహకల్ప, రెడ్డిపల్లి, ముత్తగూడెం తదితర గ్రామాల్లో బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున అందించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈసాయాన్ని ప్రకటించగా, మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబురు దయాకర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటి చైర్మన్ హరినాదబాబు, నాయకులు బండి జగదీష్, పల్లెర్ల పాండు, కిశోర్, సురేష్, వెంపటి రవి, తమ్మినేని నవీన్, వెంకటనారాయణ, వీరారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.











డీ సెట్‌లో విద్యార్థిని ప్రతిభ



తల్లాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీసెట్)లో తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెదిన చాపల రమ్యదీప్తి ప్రతిభను చాటుకుంది.. శనివారం విడుదలైన డీసెట్ ఫలితాల్లో ఆమె 75 మార్కులు పొంది రాష్ట్రస్థాయిలో 21వర్యాంకు సాధించింది. మల్లవరంకు చెందిన సామాన్య రైతు కుటుంబానికి చెందిన చాపల కొండలరావు, సీతాలక్ష్మీ దంపతుల కుమార్తె రమ్యదీప్తి అత్యంత ప్రతిభను చూపి డీసెట్‌లో రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా రమ్యదీప్తిని తల్లాడ ఎంఈవో ఎస్.దామోదరు ప్రసాద్ తదితరులు అభినందించారు.

మురుగులో వైరా మునిసిపాలిటీ

» అధికారుల నిర్లక్ష్యంతో ఆవాసాల్లో దుర్వాసన

» ప్రధాన రహదారులపై పారుతున్న మురుగునీరు

వైరా, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ మురికికూపంగా మారింది. ఈ మునిసిపాలిటీ పరిధిలోని ఏ వార్డులో చూసినా డ్రైనేజీల్లో మురుగునీరు పేరుకుపోయి ఆవాసాల్లోకి ప్రవహిస్తుండడంతో దుర్వాసన భరించలేక జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా జాతీయ ప్రధాన రహదారి, మధిర వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో ఏళ్ల తరబడి ఈ సమస్యకు మోక్షం లభించడం లేదు. జాతీయ ప్రధాన రహదారిపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. అయినప్పటికీ ప్రజాప్రతినిధులకు గానీ, మునిసిపల్ అధికారులకు గానీ ఏ మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఏళ్ల తరబడి ఉన్న ఈ సమస్య పరిష్కారానికి కనీస ప్రయత్నాలు చేయడం లేదని స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారిలో..

జాతీయ ప్రధాన రహదారిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఏసీపీ, గురుకుల బాలికల పాఠశాల, ఐఎంఎల్ డిపోకు ఎదురుగా ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లోని నివాసాల నుంచి వెలువడుతున్న మురుగునీరు జాతీయ ప్రధాన రహదారిపైనే ప్రవహిస్తోంది. ఈ అపార్ట్‌మెంట్ సమీపంలో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్ ముందు మురుగునీటితో చిన్నపాటి తటాకంలా మారింది. ఆ పెట్రోల్ బంకులోకి వాహనాలు వెళ్లి రావడానికి తీవ్ర అసౌకర్యంగా ఉంది. అపార్ట్‌మెంట్‌కు రెండో వైపున ఉన్న ఇళ్లు, నేషనల్ హైవే రోడ్డు పైనుంచి బ్రాహ్మణపల్లి అగ్రహారంలోని రోడ్లపైకి ఈ మురుగునీరు ప్రవహిస్తోంది. దాదాపు అరకిలోమీటర్ దూరానికిపైగా ఈ నీరు రోడ్డుపైనే వరదలా ప్రవహిస్తున్నప్పటికీ పట్టించుకునే దిక్కే లేదు. హైవేపై వెళ్లే వాహనాల టైర్ల నుంచి ఈ డ్రైనేజీ నీరు చిమ్మిచ్చి కొడుతుండటంతో ద్విచక్రవాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారు.



ఎక్కడికక్కడ నిలిచిన మురుగు నీరు

శాంతినగర్ డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగునీరు...

వైరా మునిసిపాలిటీ 14వ వార్డులోని శాంతినగర్ వద్ద జాతీయ ప్రధాన రహదారి పక్కనున్న డ్రైనేజీలో మురుగునీరు నిల్చిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. 2002లో రోడ్డు విస్తరణలో భాగంగా పక్కా డ్రైనేజీని నిర్మించారు. ఇప్పుడా డ్రెయినేజీలో ఆవాసాల నుంచి వచ్చిచేరిన మురుగునీరు నిల్చిపోయింది. మురుగునీరు ఎటూ కదిలే పరిస్థితి లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ముగిసిన డ్యాన్స్ శిక్షణ శిబిరం

వైరా, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వైరా పాత బస్టాండ్ సెంటర్లోని శ్రీకోదండ రామాలయంలో నృత్య కళాభారతి ఆధ్వర్యంలో 40రోజులపాటు నిర్వహించిన వేసవి డ్యాన్స్ శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ 40రోజులపాటు కూచిపూడి, కుంభహారతి నృత్యం, హస్తముద్రాల జతుల వంటి నృత్యాలను చిన్నారులు ప్రదర్శించి అలరించారు. శ్రీరామభజన మండలి అధ్యక్షురాలు లోక రమాదేవి, ఉపాధ్యక్షురాలు చెరుకుమల్లి నిర్మల చిన్నారులకు బహుమతులు అందజేశారు. నాట్య గురువు నటరాజ్‌ను సన్మానించి అభినందించారు. ఎంహెచ్.ప్రసాద్ వాయిద్య సహకారాన్ని అందజేశారు.

బీజేపీ వైరా పట్టణ ఉపాధ్యక్షుల ఎన్నిక

వైరా, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ వైరా పట్టణ నూతన ఉపాధ్యక్షులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడు మనుబోలు వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి పల్లపాటి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉపాధ్యక్షురాలు మందా సరస్వతీ, జిల్లా కిసాన్‌మోర్చా కార్యదర్శి నరుకుళ్ల వెంకటేశ్వరరావు, బీజేవైఎం ఉపాధ్యక్షుడు దుద్దుకూరి కార్తీక్ పాల్గొన్నారు. ఉపాధ్యక్షులుగా ఓర్సు శ్రీనివాస్, మాదినేని సత్యనారాయణ, యిజ్జగాని మురళీ, తాటికొండ సంధ్య ఎన్నికయ్యారు.





బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి



ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా బక్రీద్ వేడుకలు

బక్రీద్ పండుగను సత్తుపల్లి, వైరా, మధిర నియోజకవర్గాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదులకు వెళ్లి ముస్లీం సోదరులు నమాజ్ చేసి, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్న, పెద్దలంతా ఒక్కచోట కలుసుకోవడంతో మసీదుల వద్ద కోలాహలం నెలకొంది. పండుగ పురస్కరించుకొని సత్తుపల్లిలో ఈద్గావద్దకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు తమస్థాయిలో ధానధర్మాలు చేశారు. అలాగే పూర్వీకుల సమాధులవద్ద ప్రార్థనలు చేశారు. నూతన దుస్తులను ధరించి మిత్రులను ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

పేదవారికి ఇళ్లు కట్టించడమే ప్రభుత్వ లక్ష్యం

» వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇండ్లులేని ప్రతిపేదవాడికి ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లునిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మణాలకు శంకుస్థాన చేశారు. పండుగ వాతవరణంలా సాగిన కార్యక్రమంలో లబ్ధిదారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంతకాలం పేదవారు ఇండ్లు సరిగలేకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క్, రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి గూడు, నీడ ఏర్పాటుచేయలనే కాంక్షతో ఇందిరమ్మ ఇండ్లనిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఐదుసంవత్సరాల కాలంలో ఇండ్లులేని పేదవారు కనిపించకుండ నిర్మాణాలు చేస్తామన్నారు. ఇండ్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు త్వరతగతిన నిర్మించుకోవాలన్నారు. నియోజకవర్గాన్ని కారేపల్లి మండలాన్ని అభివృద్దిలో ముందుఉంచుతాన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

బాగ్యనగర్, పోలంపల్లి, అప్పాయిగూడెం, రావోజితండాలలో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఘనస్వాగతం పలికారు. తమ ఇండ్ల ముందుమామిడిఆకులు కట్టుకుని మేళతాళతో ఘనంగా స్వాగతం పలికారు. వందమందికి పైగ లబ్ధిదారులు తమ ఇండ్లకు శంకుస్థాన చేసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీవో రవీంద్రప్రసాద్, ఎస్ఐ భైరు గోపి తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మధిరటౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన మధిర పట్టణం, రూరల్‌లోని గ్రామాలకు చెందిన 20 మందికి రూ.8.49 లక్షల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. కాంగ్రెస్ నాయకులు నిడమానూరి వంశీ, తూమాటి నవీన్ రెడ్డి, చావా వేణు, బాలరాజు, కర్నాటి రామారావు, అద్దంకి రవి, బాలరాజు, జహంగీర్, రమణ, బాబు, సంగయ్య, చక్రీ పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న కిషోర్

సర్కార్ బడుల్లో సౌకర్యాలను వినియోగించుకోవాలి

» ఎంఈవో రాజేశ్వరరావు

సత్తుపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం అందజేస్తున్నామని సత్తుపల్లి ఎంఈవో ఎస్. రాజేశ్వరరావు అన్నారు. శనివారం సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు పాఠశాలల ఉపాధ్యాయులు సంయుక్తంగా నిర్వహించిన జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పద్మావతి, హరిలాల్, సుధాకరరెడ్డి, శేషు, నరసింహారావు, వెంకటేష్, లక్ష్మీకాంతమ్మలు పాల్గొన్నారు.



బడిబాటలో పాల్గొన్న ఎంఈవో రాజేశ్వరరావు

పార్టీ పటిష్టతకు పాటుపడాలి

» డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

వైరా, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. వైరా మండలంలోని పుణ్యపురం, సిరిపురం, నారపనేనిపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ గ్రామకమిటీల ఎన్నికలు, జైబాపూ... జైభీమ్...జై సంవిధాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సంస్థాగత నిర్మాణాలపై ఆయన మాట్లాడారు. ఎన్నికైన కాంగ్రెస్ గ్రామకమిటీలకు ధ్రువపత్రాలు అందజేశారు. టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వైరా ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం, ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, నాయకులు మచ్చా బుజ్జీ, మట్టూరి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కృష్ణారావు, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు, చప్పిడి వెంకటేశ్వరరావు, మోరంపూడి బాబు, శ్రీరామనేని తిరుపతిరావు, మొక్కా గోపాలకృష్ణ, గాలి శ్రీనివాసరావు, కూరాకుల ప్రసాద్, చింతనిప్పు మాధవరావు, శీలం జనార్ధన్‌రెడ్డి, నాగబోయిన కృష్ణ పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందిస్తున్న డీసీసీ అధ్యక్షుడు



